# చలిమంట

## 6

విహారి




కంచికి చేరని కథలా సాగిపోతోంది కాలం. అందునా, అనంతమైన ఉత్కంఠతో ఆడవాళ్ల మీద కత్తులు నూరుతూ పరిగెత్తుతోంది!

నా ఎదురుగా టేబుల్‌పైన ఈ రోజు పోస్టులో వచ్చిన ఉత్తరం. ఇప్పటికి రెండుసార్లు చదివాను.

ఒక వారపత్రికలో నేను నిర్వహిస్తున్న "జీవితం ఇలా"– శీర్షికకి వచ్చిన ఉత్తరం అది. హైదరాబాద్ నుంచీ ఎవరో ఒక 'సోదరి' రాసింది. నా సలహా కోరుతోంది.

విషయం సంక్లిష్టంగా వుంది. విస్మయాన్నీ కలిగిస్తోంది.

బతుకు చిత్రవర్ణాల కలనేత చీరెగా మారింది. ఏ పోగుకాపోగు సన్నటిదీ, సున్నితమైనదీ, అవిభాజ్యం

కూడా!

ఏవో 'లా' పుస్తకాలు రిఫర్ చేసుకుంటున్నాను.

ఫోన్ రింగయింది. తీశాను. విశాఖ నుంచీ రమ! ఉత్సాహంగా సాగినై మా మాటలు. "కోర్టుకి సెలవులిచ్చారు. అమ్మా, నాన్న దగ్గరికి చెన్నై వెళ్ళింది ఉష. నన్నూ మా అన్నయ్యా, వదినా హైదరాబాద్ రమ్మంటున్నారు" చెప్పాను.

"హైదరాబాద్ వెళ్తే తప్పకుండా మా రేణుకని చూసి రావే. నువ్వంటే ప్రాణం దానికి" ప్రాధేయ పూర్వకంగా అడుగుతోంది రమ.

"మీ రేణుకేం కాదు, మన రేణుక!" జోక్ చేశాను.

"అవునే వసంతా. సారీ"

ఇద్దరమూ నవ్వుకున్నాం.

ఫోన్ పెట్టేసి కుర్చీలో వెనక్కి వాలాను.

ఉషా, నేనూ పార్ట్‌నర్స్‌మి. లాయర్స్ ఫర్మ్ మాది. విజయవాడలోనే కాక హైదరాబాద్‌లోనూ కార్పొరేట్ క్లయింట్స్ ఉన్నారు. పేరూ, ఆదాయం బాగానే ఉన్నై. రమా, ఉషా, నేనూ గతంలో కొలీగ్స్‌మి. ఒక ప్రైవేట్ కంపెనీలో కలిసి పనిచేశాము నాలుగేళ్లు. మా మైత్రీ, కుటుంబాల సంబంధాలూ దృఢమైనవే. రమ భర్త లెక్చరర్. ఆమేదో చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తూ మానేస్తూ ఉంటుంది. ఒక బాబు. రమ అక్క రేణుక. ఆరేళ్ల క్రితం జరిగింది రేణుక పెళ్లి.

రేణుక పెళ్లి దృశ్యాలు తలపుకొచ్చాయి.

పెళ్లి అయిపోయి లంచ్ జరుగుతోంది.

కుటుంబసభ్యులూ, సన్నిహితులూ, ఫ్రెండ్స్- మేమందరమూ హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. మాటల మధ్యలో నావైపు తదేకంగా చూస్తూ, "చక్కటి కంఠస్వరం మీది. యాంకర్‌గా ట్రై చేయకూడదూ?" అన్నాడు సురేంద్ర. అతనే రేణుక భర్త.

కించిత్ గర్వమూ, సంతోషమూ కలిగినై నాకు. మందహాసం చేశాను. "మా బావ ఆలోచనెప్పుడూ టీవీ లోకంలో, సినీమాలోకంలో" అని గొల్లున నవ్వింది రమ. అందరూ శ్రుతి కలిపారు. సురేంద్ర టీవీలో టెక్నీషియన్. నవ్వుల మధ్యలోనే మళ్లీ అన్నది రమ, "రేణుకనీ యాంకర్ చేస్తాట్ట. పో..... దాన్ని పట్టుకుపో..." అని. ఈసారి మరీ పెద్దగా సాగినై నవ్వులు.

రేణుక ముసిముసిగా నవ్వుకుంది. కొత్త పెళ్లికూతురి నవ్వు మొహం నయన మనోహరంగా ఉంది.

"ఈడూ జోడూ బాగుంది. పిల్ల అదృష్టవంతు రాలు" పక్కన ఎవరో పెద్దావిడ మాటలు.

నేను తిరిగొచ్చేసరికి నాలుగవుతోంది. ఆఫీస్‌లోనే వుంది ఉష. ఆమె పెళ్లికి రాలేదు. ఈ పెళ్లిళ్లూ, హంగామా నచ్చవు తనకు. పైగా కోపం. పెళ్లంటే తనకున్న ఏవగింపునీ అసంతృప్తినీ - అవకాశం వచ్చినప్పుడల్లా మాకు బాగానే చెప్తూ వుంటుంది.

ఆఫీస్ అయిపోయిన తర్వాత,


నేనూ, ఉషా పార్క్‌లో కూర్చున్నాం. రేణుక పెళ్లి సంగతుల నుంచీ, ఆఫీస్ వ్యవహారాల దాకా మాటల కలబోత సాగింది.

పెళ్లి గురించిన వ్యతిరేకత మాటల్లో కొచ్చింది. ఉష తన మనసు విప్పింది.

ఉష పెద్దమ్మ కూతురిదొక దారుణమైన గాథ. కట్నం వేధింపు కేసు. ఆ పెద్దమ్మ ఇంట్లోనే వుండి చదువుకుంది ఉష. అక్కా తనూ ఎంతో కలివిడిగా వుండేవాళ్లు. బర్నింగ్ కేస్‌గా జరిగింది అక్క మరణం. ఆ దుర్ఘటన ఉష మనస్సు మీద, ఆలోచనల మీద తీవ్రమైన ప్రభావాన్నే చూపింది. పెళ్లన్నా, మగవాళ్లన్నా విముఖత ఏర్పడింది. పెళ్లి చేసుకోకూడదనే నిర్ణయం తీసుకుంది. ఉష'లా' చేసింది. నేనూ 'లా' గ్రాడ్యుయేట్‌నే. ఉష మంచి ఆలోచనాపరురాలు.

సినిమా రీలులా ఆ వివరాలన్నీ నా కళ్ల ముందు మెదిలాయి. సమాజాన్ని గురించీ, మనుషుల తెంపరితనాన్ని గురించీ ఆమె చాలా మాట్లాడిందా రోజున. నాకు గుండె పట్టేసినట్లయింది.

సహవాసదోషమో ఏమో నేను పెళ్లి గురించి ఆలోచించకుండానే రోజులు గడుపుతున్నాను.




కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

ఎన్.వి. రమణమూర్తి, విజయవాడ.

ప్రస్తుతంలో కొచ్చాను.

అన్నయ్యకి ఫోన్ చేశాను రేపే హైదరాబాద్ వస్తున్నట్టు.

రేణుకకీ ఫోన్ చేశాను. సంతోషంతో ఆహ్వానించింది. "శని ఆదివారాలు ఆఫీస్‌కి సెలవే. ఆ రెండు రోజులూ ఇక్కడ ఉండేట్టురా" అంది. "ఇక్కడ... అంటే మా ఇంట్లోనే వసంతా!" అని వివరణలాంటి హెచ్చరికా చేసింది. అడ్రస్సూ చెప్పింది. చందానగర్‌లో వాళ్ల ఇల్లు. అన్నయ్య ఉండేది దిల్‌సుఖ్‌నగర్.

శనివారం సాయంత్రం -

రేణుకా వాళ్ల ఇంటికి వెళ్ళాను. నేవెళ్లేసరికి రేణుక ఇంట్లోనే వుంది. సురేంద్ర లేడు. 'ఆఫీస్ పని మీద బయటికి వెళ్లాడు. త్వరగానే వస్తాడు' అని చెప్పింది.

రేణుక మొహంలో నేను వచ్చాననే ఆనందం గోచరిస్తూన్నా మనిషిలో ఏదో అలసట, నిరాసక్తి, నిరుత్సాహం గమనించాను.

పరీక్షగా చూశాను. ఆ కాలంలో కవితలు రాస్తూ వుండే రేణుక రూపం కళ్లముందు నిలిచింది. చలాకీతనం అంటే ఆమే అనేవాళ్లం. అందమైన లిలీ పువ్వు. ఆమె కవితల్లోని ఒక వెంటాడే వాక్యమూ గుర్తుకొచ్చింది. ఆమె అంటూ వుండేది. 'నాడూ, నేడూ, మరునాడూ లేవు; నేడే నా 'హే' డే!' అని. ఉమర్‌ఖయాం తత్వం అని అల్లరిపెట్టేవాళ్లం.

కాఫీ అయింది.

ఇల్లు చూపించింది. టూ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్. పొందికగా, సింపుల్‌గా బాగుంది.

మేం కబుర్లలో ఉండగానే వచ్చాడు సురేంద్ర. ముక్తసరిగా కుశలప్రశ్నలు వేసి గదిలోకి వెళ్ళిపోయాడు.

నన్నూ, నా బ్యాగ్‌నీ ఒక గదిలోకి చేర్చింది రేణుక. "నువ్ ఫ్రెష్ అయి రావే" అంటూ తమ గదిలోకి వెళ్ళింది.

స్నానానికి ఉపక్రమించాను. మనసు మాత్రం రేణుక ఆలోచనల్లోనే కూరుకుపోయింది. సురేంద్రకి ఆమెని యాంకర్ చేయాలనే కోరిక. ఆమెకేమో ఆ అనుభవం చేదుగా వుంది. ఇష్టం లేదు. ఒక నెల చేసి మానేసింది. చిన్న ఉద్యోగంలో చేరింది. ఇది సురేంద్రకి ఇష్టం లేదు. రమ ద్వారా నాకీ సంగతులు కొన్ని తెలుసు.

స్నానం పూర్తి చేసి హాల్లో కొచ్చాను. సోఫాలో కూర్చుని మేగజైన్

తిరగేస్తున్నాను. పక్కగదిలో నుంచి మాటలు వినపడసాగినై.

"విషయాన్ని పక్కదారి పట్టించకు. ఆమెని రమ్మని నువ్వే ఆహ్వానించావ్. ఇవ్వాళ ఆమె వస్తున్నట్టు నాలుగురోజుల క్రితమే నీకు తెలుసు. అయినా నాకు చెప్పలేదు" సురేంద్ర కంఠం ఖంగున మ్రోగుతోంది. "మీరు బిజీగా... " రేణుక ఏదో చెప్పబోయింది. "రబ్బిష్. మొన్నటికి మొన్న ఎవడో వాక్యూమ్ క్లీనర్ వాడొస్తే కొనేశావు. నాలుగు రోజుల తర్వాత చాలా క్యాజువల్‌గా చెప్పావ్ నాకు. ఉద్యోగం చేస్తున్నాననే పొగరు" "మీకు చెప్పినా అలాంటివేమీ అఖ్ఖర్లేదనేగా మీ సమాధానం...." గట్టిగానే చెప్తోంది రేణుక. "అవును మహారాణీ, నేనే నెగెటివ్ ఫెలోని. అందుకని నీయిష్టమొచ్చింది నువ్ చేస్తావ్....."

కొద్దిసేపు నిశ్శబ్దం. వాతావరణం కలుషితమైంది. నేను ఇరుగ్గా ఫీలయ్యాను.

"అవునే. పిల్లలఖ్ఖర్లేదని నాకు తెలీకుండానే పుట్టింట్లో అబార్షన్ చేయించుకున్న దానివి...."

"మీకూ అఖ్ఖర్లేదని వందసార్లు చెప్పారుగా..."

"ఇష్టమో అయిష్టమో తర్వాత.... ఏ విషయమైనా నాకు చెప్పటం అవసరమని తోచదు నీకు. మొగుడంటే నిర్లక్ష్యం. వాడి మాటంటే 'అట్టర్ డిజ్‌రిగార్డ్"

"ఇప్పుడేమయిందనీ ఊరికే రంకెలేస్తారు? ఫ్రెండ్ రావటమనేదాన్ని ఇంత సమస్య చెయ్యాలా? అన్నింటికీ రాద్ధాంతమే..."

"అవును. నేను దేనికీ ఏ రాద్ధాంతమూ చేయకూడదు. నువ్వేమో పక్కింటి కుర్రాళ్లకి ట్యూషన్లు కూడా చెప్తూ ఉంటావు..."

"ఏమిటి మీరు – ఎక్కణ్ణుంచి ఎక్కడికి పోతున్నారు. ఆ కుర్రాడు పాపం బి.టెక్ ఫస్టియర్. అటు ర్యాగింగ్. ఇటు పాఠాలు తెలీక నన్ను నాలుగు మాటలు చెప్పమంటే – అదీ నేరమేనా?"

"అవును తల్లీ... నువ్వేం చేసినా నేరం కాదు. అంతా నాదే నేరం..." "వసంత బయటికొచ్చినట్టుంది. కాస్త వాయిస్ తగ్గించండి"

గదిలో ఏదో ఠప్‌మని విసిరికొట్టిన శబ్దం. రేణుక గది బయటికొచ్చి, హాలు దాటుకుని కిచెన్‌లోకి వెళ్ళింది.

సురేంద్ర నిమ్మళంగా హాల్లోకొచ్చాడు. మొహాన్న తెచ్చిపెట్టుకున్న నవ్వు. కూర్చున్నాడు. "చెప్పండి. ఎలా వున్నారు? ఏమిటి విశేషాలు?" కుశలప్రశ్నలు సాగినై. అతని కార్యకలాపాలూ, నా ప్రాక్టీస్ – మాటల్లో దొరలినై. అన్నీ బోలు మాటలు.

కాఫీలు తెచ్చింది రేణుక. తీసుకున్నాం.

"నా కంఠస్వరం ఇప్పుడెలా వుంది సురేంద్రగారూ?" సరదాగా అడిగాను. వాతావరణంలో ప్రశాంతతని ఆశిస్తూ.

"కోర్టు గొంతు వచ్చేసింది" అంటూ నవ్వాడు. "అప్పటి టింగ్‌లింగ్ వాయిస్ గయా"

నేనూ నవ్వాను. రేణుక మొహం గంభీరంగా వుంది. పెదవుల మీద తెచ్చికోలు నవ్వు.

"వయసొచ్చేస్తున్నదన్నమాట" అన్నాను తేలిగ్గా.

"ఫర్వాలేదు. ఇంకా అమ్మమ్మ వాయిస్ రాలేదు" అని గలగలా నవ్వేశాడు.

సంభాషణ నా ప్రొఫెషన్ మీదికీ, పెళ్లిమీదికీ మళ్లింది. కొద్దిసేపటి తర్వాత సురేంద్రే అన్నాడు. "అయితే మీరూ, మీ ఉషా వృద్ధకన్యలుగా మిగిలిపోతారన్నమాట" అని.

"కావచ్చు" అన్నాను నిర్లిప్తంగా

టీవీ ఆన్ చేసి వాల్యూమ్ పెంచింది రేణుక. సురేంద్ర మొహం మీద గంటుపెట్టుకుని "సీరియల్.... ఇదీ వరుస...." అనుకూంటూ తన గదిలోకి నడిచాడు.

–డిన్నర్ అయింది. కిచెన్ సర్దేసి వచ్చింది రేణుక. హాల్లో కొద్దిసేపు పచార్లు చేసి, నాకు 'గుడ్‌నైట్' చెప్పి రూమ్‌లోకి వెళ్ళిపోయాడు సురేంద్ర. వెళ్తూ వెళ్తూ

## ఇప్పటికీ

**మందరపు హైమవతి**

చూస్తుండగానే
సూర్యరశ్మికి మంచుబొమ్మ
కరిగి పోయినట్లు
నవ్వు నడక
మాట మనిషి మాయమై
ఒక జ్ఞాపకంగా మిగలడం
ఎంత విషాదం
× × ×
తవ్విన కొద్దీ
నీళ్ళూరుతున్న చెలమలా
ఇన్నాళ్ళైనా
ఈ దుఃఖం తడియారదేమి
× × ×
వర్షం ఆగినా
అగి ఆగి చెట్టునుంచి రాలిపడే చినుకుల్లా
గుండె చూరు నుంచి
ఉండి ఉండి కన్నీటి చినుకులు
రాలిపడుతునేఉన్నాయి
× × ×
జలుబని జ్వరమని
ఒక్క రోజైనా విశ్రాంతి మంచమెక్కని నువ్వు
ఆస్పత్రికని వెళ్ళి
అట్నుంచటే వెళ్ళి పోయావుగదా!
అలిగిన పసిపిల్లలా
× × ×
నిర్దాక్షిణ్య లోకంలో
కరకు మాటల గొడ్డళ్ళతో
హృదయ వృక్షాన్ని సమూలంగా
కూల్చి వేసిన ఘడియల్లో
నీ చల్లని ఒడిలో శిశువునై
నీ అమృత స్పర్శలో
మళ్ళీ చిగురుల మొలక నయ్యేదాన్నికదా!
× × ×
అమ్మా!
ఇప్పుడెవరున్నారమ్మా! నాకు
గాయాలకు లేపనౌషధంగా
మనసుకు సాంత్వన గీతంగా
× × ×
అలమారులో
సగం వాడిన మందుసీసాలు
బీరువాలో చీరలు చూసినపుడల్లా
జ్ఞాపకాల కుమ్మరి పురుగు
మనసును తొలిచి వేస్తూనే వుంటుంది
× × ×
ఇంటికి రావడం
ఆలస్యమైన సాయంకాలాల్లో
ఆందోళన కంగారు
తీగలల్లుకొన్న ఒంటరి వృక్షంలా
వీధి వాకిట్లో గేటునానుకొని
ఎదురు చూపులు చూస్తూ
నీవు నుంచున్న దృశ్యం
ఇప్పటికీ కళ్ళకి కట్టినట్లే ఉంది
× × ×
ఇన్నాళ్ళైనా
ఏ మూలనుంచో
అమ్మలు అమ్మలు అని
నువ్వు పిలుస్తున్నట్లేవుంది ఇప్పటికీ

అతను రేణుక నుద్దేశించి ఆహ్వానపు సైగ చేస్తూ చిత్రంగా తలతిప్పాడు. సిగ్గుతో తలదించుకుంది రేణుక.

చాలా పొద్దుపోయేవరకూ కబుర్లలోనే ఉండిపోయాం నేనూ, రేణుకా. రేణుక సంసారం గురించి మరికొంత తెలుసుకోవాలనే ఉత్సుకత కలిగినా, ధైర్యం చేసి భార్యాభర్తల వ్యక్తిగత విషయాలు అడిగే సాహసం చేయలేకపోయాను.

–మర్నాడు,

కాఫీల తర్వాత నేను ప్రయాణమైనాను. అన్నయ్య ఇవ్వాళ టూర్‌కి వెళ్లాల్సొచ్చిందనీ, ఆయనతో కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడాలనీ సాకు చెప్పి బయటపడ్డాను.

......

కనిపించని శత్రువులా చొచ్చుకుపోతోంది కాలం.

పది నెలలు గడిచాయి.

రేణుక విజయవాడ వచ్చింది. ఉషా, నేనూ, మా ముందు రేణుక!

నింపాదిగా విషయం బయటపెట్టింది. "నేనూ, సురేంద్రా విడిపోయాం!"

నేను విస్తుపోయాను. ఉషకేసి చూస్తే ఆమె కూడా అంతే ఆశ్చర్యానికి లోనయి వుంది. ఇద్దరమూ రేణుక వైపు మూగచూపులు చూశాము.

"అవును. సురేంద్రతో సర్దుకుపోవటం నావల్ల కాలేదు. హారిబుల్ ఇగోటిక్. ఆ హింస భరించలేక నేనే ప్రపోజ్ చేశాను. ఆర్నెల్లయింది. మళ్లీ పెళ్లి కూడా చేసుకున్నాట్ట. పెద్దగా వివరాలు తెలీవులే"

మా ముఖ కవళికలు గమనించింది. మాలో లోపల వేస్తున్న ప్రశ్నల్నీ చదువుకున్నట్లుంది. తలవంచుకుని చెప్పుకుపోయింది. "ప్రతి విషయానికీ నామీద నెపమే. నేరాలెన్నటమే. అదే ఆయన దినచర్యగా మారిపోయింది. చివరికి ఓ బిటెక్ బచ్చాతో కూడా నాకు సంబంధం అంటగట్టే స్థితికి దిగజారిపోయాడు. ఆ అరికాళ్ల కింద మంటని భరించలేకపోయాను. అతని అహంతో నాకు బతుకంటేనే విసుగుపుట్టింది. ఇప్పుడు ప్రాణం హాయిగా వుంది. నా సంపాదన నాకు చాలు"

"అమ్మా, నాన్నా?" అడిగాను.

"ముందు ఏడ్చారు. ఆ తర్వాత తప్పుచేశానని కోప్పడ్డారు. క్రమేణా వాళ్లూ అర్థం చేసుకున్నారు" చెప్పింది.



కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

ఎన్.వి. రమణమూర్తి, విజయవాడ.

రేణుక పెళ్లి, ఆ తర్వాత నేనామె ఇంటికి వెళ్లినప్పటి సంఘటనలూ గుర్తుకొచ్చాయి. మనసులో శతకోటి ఆలోచనలు సుడి తిరిగాయి. రేణుక-సురేంద్ర జంట మధ్య జరిగిన సంఘటనలు విడాకుల వరకూ దారితీశాయా? అమ్మ, అమ్మమ్మ, నాయనమ్మ రాక్షసుల్లాంటి మగవాళ్ల చర్యల్ని గురించి ఎన్నెన్నో విషయాలు చెప్పేవారు. వాటిముందు ఇవన్నీ ఏపాటివి? ఆ కాలంలో ఇలా విడిపోవటమే లేదు గదా! ఎక్కడో, ఎప్పుడో... నూటికి, కోటికి ఒక్క కేసుగా వుండేది. ఇప్పుడు స్త్రీ పురుషులిద్దరూ తెలివి మీరిపోయారా? పురుషాధిక్యత మితిమీరిపోతోందా, లేక స్త్రీ తన వ్యక్తిత్వాన్ని పెంచుకుంటోందా? లేక భార్యాభర్తల మధ్య సాంఘిక జీవితం ఘర్షణపాలయిందా? సమన్వయని తెగేదాకా లాక్కుంటున్నారా? అసలీ సమస్య వ్యక్తిగతమా, సామాజికమా?

మనసు పరిపరివిధాల పోయింది. మేథ వేడెక్కింది.

ఉషతో అంటున్నది రేణుక, "కడుపులో లేనిది కావలించుకుంటే వస్తుందా?" అని. ఈ మాటలనేటప్పుడు రేణుకలో ఎలాంటి భావోద్వేగమూ లేదు. చాలా క్యాజువల్‌గా అనేసింది.

నాకు లోలోపల రొద ఎక్కువైంది.

ఈ ఆలోచనలతోనే ఆ రాత్రి నా నిద్రపోయింది.

✿ ✿ ✿

తన మాయాజాలాన్ని తాను సాగిస్తూనే వుంది కాలం.

ఏడాది దాటింది.

ఇవ్వాళ, మళ్లీ హఠాత్తుగా ఊడిపడింది రేణుక. విజయవాడ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. బుక్ ఎగ్జిబిషన్ జరుగుతోంది. వెళ్ళి ఖాళీ ఆవరణలో కూర్చున్నాం ముగ్గురమూ. మేమంతా కలిసి బతికిన క్షణాల్ని తలచుకున్నాం. ఎన్నెన్నో సంభవాలు, జ్ఞాపకాలు పంచుకున్నాం. హోటల్లో భోజనం చేసి మా ఫ్లాట్‌కి తిరిగివచ్చాం.

ఉన్నట్టుండి సంభాషణని తనమీదికే మళ్లించుకుని చెప్పసాగింది రేణుక.

"బతుకు నిస్సారంగా ఉండే. ఆఫీస్‌లో ప్రతి మగపురుగూ ఆకలి కళ్లతో చూసేవాడే. ఒకరిద్దరైతే త్యాగమూర్తుల ఫోజులో ప్రపోజల్స్! ఏమనో తెలుసా? 'లివింగ్ టుగెదర్' గురించీ, 'లివ్ ఇన్' సంస్కృతి గురించీ లెక్చర్లు. సానుభూతివర్షం. దొంగచాటు చర్చలూ, వెక్కిరింపులూ..... వెకిలి వేషాలూ! న్యూసెన్స్‌గా ఉందనుకో."

చెప్తున్నదల్లా ఆగి సోఫాలో నాకు చాలా దగ్గరగా జరిగింది.

గుడ్లప్పగించి చూస్తున్నాం నేనూ, ఉషా. శతాబ్దాలుగా తనలో అణగారివున్న భావాల్ని తొలిసారి వ్యక్తం చేస్తున్నదానిలా ఉద్విగ్నంగా అన్నది రేణుక, "వసూ.... ఉన్నమాట చెప్తున్నాను. సురేంద్ర అంటే నాకు ప్రాణమే! ఐ జస్ట్ లవ్ హిమ్. ఆ ఆరాధన నుంచీ, ఆ ప్రేమ నుంచీ బయటపడలేకపోతున్నానే. అవును. ఐ వాంట్ హిమ్. నాకతను కావాలి. నాకు సురేంద్ర కావాలి....!" అని ఒక్క ఉదుటున నన్ను కౌగిలించుకుని ఏడ్చేయసాగింది.

నేను దిగ్భ్రమ చెందాను. ఉషదీ అదే స్థితి!

ఈ రోజే వచ్చిన ఉత్తరం ఠక్కున గుర్తుకొచ్చింది నాకు. అయితే అందులో 'సోదరి' మా రేణుకా?!

ఇంత హఠాత్తుగానూ, బయట ఆకాశమూ ఉరుముతోంది.

వాస్తవం సినిమా కాదు, సీరియలూ కాదు. ముగింపులూ, పరిష్కారాలూ తెరకెక్కించటానికి. మరి రేణుక కోరిక?....

ఉషా, నేనూ – ఇద్దరమూ లాయర్స్‌మే. కానీ, దిక్కులు చూస్తున్నాము.

రేణుక పొగిలిపొగిలి ఏడుస్తూనే వుంది. జవాబులు రాసి ఇచ్చేసిన పరీక్ష పేపర్ తిరిగి ఇమ్మంటోంది!

ముగింపు మీరే చెప్పండి!!